


సబ్‌జైలులో జిల్లా జడ్జి తనిఖీ

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలోని సబ్‌జైలులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.వి.పార్థసారథి, డీఎల్‌ఎస్‌ఏ జడ్జి టి.లీలావతి తనిఖీ చేశారు.



బంగారు హారం వితరణ

వినుకొండ(నూజెండ్ల): ఏనుగుపాలెం రోడ్డులోని అంకాలమ్మకు చిట్టూరి వెంకట రవి, పద్మావతి కుటుంబం రూ. రెండున్నర లక్షల విలువైన బంగారు నగ కానుక ఇచ్చింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 580.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,578 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని సేవలో ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ



అమరావతి: అమరావతిలో వేంచేసి ఉన్న బాల చాముండికా సమేత అమరేశ్వరుడిని ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ మహేష్ చంద్ర లడ్హా కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. తొలుత మహేష్ చంద్రలడ్హాను ఆలయ అర్చకులు, వేద పండితులు ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా అమరేశ్వర స్వామికి అభిషేకాలు, బాల చాముండేశ్వరి దేవికి అష్టోత్తర కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం మహేష్ చంద్ర లడ్హాకు వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనం అందించారు. స్వామి వారి శేషవస్త్రంతోపాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నీటి కుంటలో ఫార్మసీ విద్యార్థి గల్లంతు



మేడికొండూరు : నీటి కుంటలో ఈతకు దిగిన విద్యార్థి గల్లంతైన సంఘటన మండల పరిధిలోని భీమినేని వారి పాలెం సమీపంలో ఉన్న కేసిరెడ్డి కళాశాల ఆవరణలో జరిగింది. సీఐ నాగూర్ మీరా సాహెబ్ తెలిపిన వివరాల ప్రకారం.. కేసిరెడ్డి ఫార్మసీ కళాశాలలో తెనాలికి చెందిన మూల్పూరి రంజిత్ (21) బీఫార్మసీ నాలుగవ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం కళాశాలకు తూర్పు వైపున మంచినీటి కుంటలో మోటార్ రిపేర్‌కు వచ్చింది. మరమ్మతులు చేసేందుకు కళాశాలలో పని చేసే మెకానిక్ వెళుతుండగా, అతని వెంట సుమారు పది మంది విద్యార్థులు కుంట వద్దకు వెళ్లారు. వీరిలో రంజిత్ ఈత కొట్టడానికి కుంటలో దిగి గల్లంతయ్యాడు. మేడికొండూరు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అతడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి సమయానికి కూడా ఆచూకీ తెలియలేదు.

వైభవంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- ప్రత్యేక ఆకర్షణగా కళా ప్రదర్శనలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ ఆదివారం తెల్లవారుజామున వైభవంగా జరిగింది. దేవస్థాన ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ సుమారు 8 కిలోమీటర్ల మేర సాగింది. తొలుత ప్రత్యేకంగా పూలతో అలంకరించిన రథంపై శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో కెఎస్. రామరావు కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాలు, సితార సెంటర్, కబేళా, పాలప్రాజెక్టు, కేఎల్‌రావు నగర్, చిట్టినగర్, కేటీ రోడ్డు, నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదుగా అమ్మవారి ఆలయానికి ప్రదక్షిణ చేరింది. కూచిపూడి, భరతనాట్యాలను చిన్నారులు ప్రదర్శిస్తూ గిరి ప్రదక్షిణలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆది దంపతులకు భక్తులు హారతులిచ్చి స్వాగతం పలికారు. అమ్మవారికి, అయ్య వార్లకు పండ్లు, ఫలహారాలు నివేదనగా సమర్పించారు.

అమరజీవి అజరామరం



పల్నాడులో..

నరసరావుపేట: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు తన జీవితాన్నే అర్పించారని కలెక్టర్ పి.అరుణ్‌బాబు కొనియాడారు. అమరజీవి ఆత్మార్పణ దినం సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో శ్రీరాములు చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. ఆయన తెలుగు వారందరూ ఒకే చోట ఉండాలని కాంక్షిస్తూ చేసిన త్యాగనిరతిని కొనియాడారు. డీఆర్వో ఎ.మురళి, ఆర్డీఓ కె.మధులత కూడా కలెక్టర్‌తోపాటు పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించారు. అమరజీవిపై రూపొందించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఈ సందర్భంగా శంకరభారతీపురం విద్యార్థినులు ప్రదర్శించారు.



గుంటూరులో..

పట్నంబజారు: పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, పార్టీ నగర అధ్యక్షుడు, డిప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు)లు ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, షేక్ మస్తాన్ వలి, అంగడి శ్రీను, ఆవుల సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాపట్లలో..

బాపట్ల: పొట్టి శ్రీరాములు ఆశయాలను సాధిద్దామని జేసీ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా బాపట్ల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఉన్న ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. జేసీ మాట్లాడుతూ అమరజీవి ఆశయాల కోసం యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, బాపట్ల శ్రీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త మాసు సత్యనారాయణ, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు వెల్లంపల్లి సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

అల్పపీడనంతో కలవరింత

అన్నదాతల్లో వణుకు

- వరుస వాయుగుండాలతో ఆందోళన
- కోతకు సిద్ధమైన వరి పైర్లు
- కోతలు కోసేందుకు మీమాంస

బాపట్లటౌన్: వరుస వాయుగుండాలు వాయగొడుతున్నాయి. ఫలితంగా అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పది రోజుల క్రితం ఫెంగల్ తుపాన్ మిగిల్చిన నష్టం నుంచి తేరుకోకముందే మరో అల్పపీడనం ముంచుకొచ్చింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ అల్పపీడన ప్రభావంతో బాపట్ల తీర ప్రాంతంలో మబ్బులు కమ్ముకున్నాయి. ఈనెల 17వ తేదీ తర్వాత కోస్తాంధ్ర జిల్లాలో భారీ వర్షాలు కురిసే ప్రమాదముందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో వరి రైతులు తీవ్రంగా కలవరపడుతున్నారు. కోతలకు సిద్ధమైన పంటలను ఏం చేయాలో పాలుపోక విలవిల్లాడుతున్నారు. నెల రోజుల క్రితం వరకు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొని అష్టకష్టాలు పడి పంటలు సాగు చేసిన రైతులను ఇప్పుడు వాయుగుండాలు వెంటాడుతుండడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉంటే చలిగాలులకు వరి గింజలు రాలిపోవడం, ఏపుగా పెరిగిన పంట నేలవాలిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పుడు అల్పపీడనం భయంతో కొందరు కోతలు కోయాలా, వద్దా అనే సందేహంలో ఉన్నారు. మరికొందరు ఇప్పటికే కోసి ఉన్న ఓదెలను పూర్తిగా ఎండక ముందే కట్టివేతలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తిగా ఎండక ముందే కుప్పవేస్తే గింజ రంగు మారి దిగుబడి తగ్గే ప్రమాదం ఉన్నా.. తప్పక కుప్పలు వేస్తున్నారు.



కర్లపాలెం మండలంలో ఓదెలపై ఉన్న వరి పంట

ముమ్మరంగా కోతలు

బాపట్ల మండలంలో ఈ ఏడాది 23,025 ఎకరాలు, కర్లపాలెం మండలంలో 16,700, పిట్టలవానిపాలెం మండలంలో 11,600 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటికే పిట్టలవానిపాలెం మండలంలో అల్లూరు, అలకాపురం, గోకరాజు నల్లిబోయినవారిపాలెం, ఖాజీపాలెం, చందోలు, నదిముల్లాయపాలెం, పిట్టలవానిపాలెం, మంతెనవారి పాలెం గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల కోసిన వరి పనలు కల్లాల్లోనే ఉన్నాయి. ఇదిలా ఉంటే 1,500 ఎకరాల్లో వరి కోత యంత్రాలతో నేరుగా ధాన్యం నూర్పిడి చేశారు.

- కర్లపాలెం మండలంలో పెదగొల్లపాలెం, పేరలి, ప్యార్లిపాడు, చింతాయపాలెం, గణపవరం, నర్రావారిపాలెం, తుమ్మలపల్లి, యాజలి, బుద్ధాం గ్రామాల్లో ఇప్పటివరకు సుమారు 2 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. సుమారు 500 ఎకరాల్లో యంత్రాలతో ధాన్యం నూర్పిడి చేశారు. మిగిలిన ప్రాంతాల్లో పంట కోతకు సిద్ధంగా ఉంది.



పిట్టలవానిపాలెం మండలంలో కట్టివేత పనులు

- బాపట్ల మండలంలోని ఈస్ట్ పిన్నిబోయినవారి పాలెం, వెస్ట్ పిన్నిబోయినవారి పాలెం, చుండూరుపల్లి, ఈతేరు, గుడిపూడి, భర్తిపూడి, నేరుడుపల్లి, అప్పికట్ల, మర్రిపూడి, ఈస్ట్ బాపట్ల, వల్లువారి పాలెం గ్రామాల్లో సుమారు 1,000 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాల్లోని పొలాలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు పడితే పైర్లు నేలవాలిపోతాయని, ఓదెలపై ఉన్న పైర్లు మొలకలు వస్తాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉంటే వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల మూడు రోజులపాటు రైతులు కోతలను వాయిదా వేసుకోవాలని అధికారులు సూచించారు.

గుంటూరు జీజీహెచ్‌లో మరో భవనం





పైలాన్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, డాక్టర్ పాదిల ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రూ. 10 కోట్లతో నిర్మాణానికి శంకుస్థాపన

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని డాక్టర్ పాదిల ప్రసాద్ జింకానా సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో జింకానా సహకారంతో రూ. 10 కోట్ల వ్యయంతో అదనంగా రెండు అంతస్తుల భవనం నిర్మించనున్నారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా శంకుస్థాపన పనుల పైలాన్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ... ఒక డాక్టర్‌కు మెడలో స్టెతస్కోప్ ఎలా ఉంటుందో, గుంటూరు జీజీహెచ్‌కు జింకానా సేవలు ఒక మణిహారంలా ఉన్నాయని చెప్పారు. జింకానా డోనర్స్ సభ్యులను అభినందించారు. జింకానా సభ్యుల విరాళాలతో రూ. పది కోట్ల వ్యయంతో ఆస్పత్రిలో రెండు అంతస్తుల నిర్మాణం, రూ.వంద కోట్లతో తల్లీపిల్లల విభాగం, నాట్కో సహాయంతో క్యాన్సర్ వార్డు నిర్మాణం తదితర పనులు జరుగుతున్నాయని తెలిపారు. గుంటూరు వైద్య కళాశాలలో చదివిన వారు జింకానా పేరుతో తమ కళాశాల అభివృద్ధికి చేస్తున్న సేవలు దేశవ్యాప్తంగా ఆదర్శనీయమని చెప్పారు. వీరికి డాక్టర్ పాదిల ప్రసాద్ నేతృత్వం అభినందనీయం అని వెల్లడించారు. డాక్టర్ పాదిల ప్రసాద్‌కు, జింకానా సభ్యులు, బిల్డింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సాగి రెడ్డి బాబురెడ్డికి గుంటూరు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. విరాళాలను సక్రమంగా ఉపయోగించేలా చూస్తామన్నారు. డాక్టర్ పాదిల ప్రసాద్ మాట్లాడుతూ.. కన్న తల్లి, జన్మభూమికి ఎంత ఇచ్చినా రుణం తీరదని పేర్కొన్నారు. జింకానా విజయవంతం వెనుక పటిష్టమైన వ్యవస్థ కారణమని తెలిపారు. జింకానా కోఆర్డినేటర్లు డాక్టర్ నూతక్కి వేంకటేశ్వర రావు, డాక్టర్ బసవ పున్నయ్య, డాక్టర్ ప్రభాకర రావు, డాక్టర్ బాల భాస్కర్ రావు, డాక్టర్ హనుమంత రావుల సేవలను అభినందించారు. రూ.10 కోట్ల విరాళంలో డాక్టర్ పాదిల ప్రసాద్ రూ.రెండున్నర కోట్లు ఇవ్వగా, జింకానా సభ్యులు మిగిలిన మొత్తం ఇచ్చారు. అనంతరం ప్రసాద్‌ను కేంద్ర మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్ బాబు, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, చైర్మన్ బిల్డింగ్ కమిటీ యూఎస్‌ఏ జింకానా డాక్టర్ సాగిరెడ్డి బాబురెడ్డి, నాట్కో వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు, తులసీ సీడ్స్ అధినేత శ్రీ రామచంద్ర ప్రభు, టీడీపీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీఎల్‌ఐడీసీ చైర్మన్ పిల్లి మాణిక్య రావు, మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. వి. సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వి. సతీష్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, సీఎంఓహెచ్ఓ డాక్టర్ శోభారాణి, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ సయ్యద్ రసూల్, కార్పొరేటర్లు ముత్తినేని రాజేష్, పోతురాజు సమత తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన గుంటూరు జిల్లా ఎడ్లు

బండలాగుడు పోటీల్లో ప్రథమ స్థానం



పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టులో వెలసిన కాశినాయన 29వ ఆరాధన మహోత్సవం సందర్భంగా ఆదివారం తెలుగు రాష్ట్రాల స్థాయి పెద్దసైజు బండలాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. గుంటూరు జిల్లా కుంచనపల్లి గ్రామానికి చెందిన పీఆర్ మెమోరియల్ ప్రలగం ప్రతిజ్ఞరెడ్డి, జస్వితరెడ్డి ఎడ్ల జత 1,845 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఎడ్ల జతకు రూ.60,116 నగదు బహుమతిగా అందజేశారు. బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన వీరాస్వామి చౌదరి ఎడ్ల జత 1,800 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలవగా, రూ.50,116 అందించారు. నంద్యాల జిల్లా కుంపరమానుదిన్నె గ్రామానికి చెందిన కుందురు రాంభూపాల్ రెడ్డి ఎడ్ల జత 1,640 అడుగులు లాగి తృతీయ స్థానం సాధించగా, రూ.40,116 ఇచ్చారు. నంద్యాల జిల్లా జిల్లెలగోస్పాడు గ్రామానికి చెందిన గారటికె నాగిరెడ్డి ఎడ్ల జత 1626 అడుగులు లాగి నాలుగో స్థానంలో నిలవగా, రూ.30,116 బహూకరించారు. మార్కాపురం మండలం బొడిచర్ల గ్రామానికి చెందిన తిండి నక్షత్రరెడ్డి ఎడ్ల జతలు 1,620 అడుగులు, 1,092 అడుగులు లాగి ఐదు, ఆరో స్థానంలో నిలిచాయి. ఐదో బహుమతిగా రూ.20,116, ఆరో బహుమతిగా రూ.10,116 నగదును విజేతలకు అందజేశారు. వీక్షకులు పెద్దసంఖ్యలో వచ్చారు.

తపాలా శాఖలో పని సంస్కృతి కొనసాగాలి





ప్రసంగిస్తున్న డీవీఎస్సార్ మూర్తి, వేదికపై వివిధ సంఘాల ప్రతినిధులు

పోస్ట్ మాస్టర్ జనరల్ డీవీఎస్సార్ మూర్తి

తెనాలి: తపాలా శాఖలో ఇప్పుడున్న పని సంస్కృతిని ఉద్యోగులు కొనసాగించాలని పోస్ట్ మాస్టర్ జనరల్ (విశాఖ, విజయవాడ రీజియన్లు) డీవీఎస్సార్ మూర్తి సూచించారు. భారతీయ పోస్టల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సర్కిల్ గ్రూప్–సీ, పోస్ట్‌మ్యాన్ అండ్ ఎంటీఎస్ అండ్ బీజీడీకేఎస్ (జీడీఎస్) తృతీయ సమావేశాలు ఆదివారం ఘనంగా జరిగాయి. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ఏర్పాటైన ఈ సమావేశాలకు గ్రూప్–సీ ఏపీ సర్కిల్ అధ్యక్షుడు ఈ.హనుమంతరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా డీవీఎస్సార్ మూర్తి మాట్లాడుతూ... టెక్నాలజీ, ప్రైవేటు కొరియర్ సర్వీసుల పోటీని తట్టుకుని తపాలా శాఖ నిలబడటం గొప్ప విషయమన్నారు. ఉద్యోగుల అంకితభావం ఇందుకు కారణమన్నారు. ఇంత మంచి పని సంస్కృతిని కొనసాగించాలని కోరారు. గ్రూప్–సీ ఏపీ సర్కిల్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకయ్య మాట్లాడుతూ రెండేళ్ల వ్యవధిలో అసోసియేషన్ ఏడు డివిజన్ల నుంచి 24 డివిజన్లకు విస్తరించినట్టు చెప్పారు. కార్యదర్శి నివేదికను వివరించారు. సమావేశంలో భారతీయ పోస్టల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనంతకుమార్ పాల్, పోస్టుమ్యాన్ అండ్ ఎంటీఎస్ ఏపీ సర్కిల్ అధ్యక్షుడు జి.బ్రహ్మయ్య, జీడీఎస్ ఏపీ సర్కిల్ అధ్యక్షుడు ఎ.వెంకటరామిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి సంతోష్‌కుమార్ సింగ్, పోస్ట్‌మ్యాన్ అండ్ ఎంటీఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఖైలీరామ్ శర్మ, బీజీడీకేఎస్ ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్, బీపీఆర్ఎస్‌ఏ ప్రధాన కార్యదర్శి కాళిముత్తు కృష్ణమూర్తి, ఆలిండియా బీఎంఎస్ ఓఏ ప్రేమ్‌చంద్, కాకతీయ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు, వివిధ విభాగాల అసోసియేషన్ల నాయకులు పీవీ వసంతరావు, జి.వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, ఆలిండియా ఐపీ/ఏఎస్‌పీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తారక్‌నాథ్ బాదురి తదితరులు మాట్లాడారు. తొలుత బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు.

జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘానికి నూతన కార్యవర్గం



గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘం గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా పి.సంతోష్‌కుమార్, వి. వెంకటేశ్వర రావులు ఎన్నికయ్యారు. కలెక్టర్ బంగ్లారోడ్డులోని కృషి భవన్‌లో ఆదివారం గుంటూరు శాఖకు ఎన్నికలు నిర్వహించారు. అటవీ శాఖ ఉద్యోగులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గుంటూరు శాఖ ఉపాధ్యక్షుడిగా ఎస్.మోహన్‌రాజు, సంయుక్త కార్యదర్శిగా షేక్ అమీర్‌జానీ బాషా, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.వెంకయ్య, కోశాధికారిగా ఎస్, పురుషోత్తమ రాజు ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు శశిభూషణ్ యాదవ్, ప్రాంతీయ కార్యదర్శి రవీంద్ర ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు.





మాలల మహాగర్జన

వర్గీకరణ, క్రిమిలేయర్ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గుంటూరు రూరల్ మండలం నల్లపాడు గ్రామంలో రాష్ట్ర స్థాయి మాలల మహాగర్జన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వర్గీకరణ పేరుతో మాలలకు రిజర్వేషన్లు తీసివేయాలని ఏపీ సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ కుట్రలు పన్నుతున్నారని నాయకులు ఆరోపించారు. వారి తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవీ ప్రసాద్ అధ్యక్షత వహించగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ముని మనుమడు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా జాతీయ ఐస్ స్కేటింగ్ డే వేడుకలు



లక్ష్మీపురం: స్కేటింగ్ సాధనతో చిన్నారుల్లో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం పెరుగుతాయని ఆంధ్రప్రదేశ్ ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ సెక్రటరీలు షేక్ ఖాజా, అబ్దుల్ సలాం, నూరుద్దీన్‌లు అన్నారు. బ్రహ్మానంద రెడ్డి స్టేడియంలో ఆదివారం జాతీయ ఐస్ స్కేటింగ్ డే వేడుకలను ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చినవారు గంట పాటు స్కేటింగ్ చేశారు. అనంతరం క్రీడాకారుల విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. పాల్గొన్న వారికి సర్టిఫికెట్‌లను అందజేశారు.

నసీర్ అహ్మద్‌కు జాతీయ సమైక్యత పురస్కారం



పిడుగురాళ్ల: పిడుగురాళ్లకు చెందిన రచయిత సయ్యద్ నసీర్ అహ్మద్ జాతీయ సమైక్యత పురస్కారం అందుకున్నారు. అనంతపురం జిల్లాలోని చారిత్రక పెనుగొండ పట్టణంలో ఈ నెల 13న పెనుగొండ దర్గా అధిపతి తాజుద్దీన్ బాబా అధ్యక్షతన జరిగిన జాతీయ సమగ్రత-సమైక్యత, ఐక్యత సదస్సులో నసీర్ అహ్మద్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు మహ్మద్ షరీఫ్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు నసీర్ అహ్మద్ తెలిపారు. జంపని ఆస్థాన అధినేత నిజాముద్దీన్‌తోపాటు పలు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సినీఫక్కీలో గాల్లోకి ఎగిరిన కారు

వ్యక్తికి గాయాలు



యడ్లపాడు: సినీఫక్కీలో కారు గాల్లోకి ఎగిరి వంతెనపై నుంచి సర్వీసు రోడ్డుపై పడిన సంఘటన మండలంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన పులిపాక అజయ్ విజయవాడ నుంచి ఒంగోలుకు కారులో ప్రయాణిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి మండలంలోని వంకాయలపాడు గ్రామం సమీపంలోకి రాగానే అజయ్‌కు నిద్రమత్తుతో కారు అదుపు తప్పింది. దీంతో ఎక్స్‌ప్రెస్ హైవే పక్కనున్న గడ్డర్లకు ఢీకొని కారు గాల్లోకి ఎగిరి సర్వీసు రోడ్డులోకి వచ్చి పడింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా, కారులోని అజయ్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది బాధితుడికి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. అర్ధరాత్రి కావడం, సర్వీసు రోడ్డు నిర్మానుష్యంగా ఉండటంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

సోమేపల్లి జీవితం ఆదర్శనీయం

- అన్ని బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించిన వెంకట సుబ్బయ్య
- 'సాహితీ సౌరభం' సమావేశాల్లో డాక్టర్ పాపినేని శివశంకర్



హరిత సంతకం గ్రంథావిష్కరణలో పాపినేని శివశంకర్ తదితరులు

నగరంపాలెం: సోమేపల్లి వెంకట సుబ్బయ్య వృత్తి ధర్మం, కుటుంబ బాధ్యతలు, సమాజ ధర్మాలను సమపాళ్లలో నిర్వర్తించారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, గుంటూరు జిల్లా రచయితల సంఘం, రమ్య భారతి, సోమేపల్లి లిటరరీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో లక్ష్మీపురం కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆదివారం 'సోమేపల్లి సాహితీ సౌరభం' పేరుతో ఐదు సాహితీ సమావేశాలు నిర్వహించారు. తొలుత సోమేపల్లి వెంకట సుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రచయితల సంఘం ఏర్పాటు స్ఫూర్తిదాయకం

అనంతరం జరిగిన తొలిసభకు అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ చిల్లర భవానీదేవి మాట్లాడుతూ.. జిల్లా, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఏర్పాటుతో యువ రచయితలకు స్ఫూర్తిదాయకంగా కార్యక్రమాలు నిర్వహించిన గొప్ప మానవతావాది వెంకట సుబ్బయ్య అని కొనియాడారు. సోమేపల్లి వెంకట సుబ్బయ్య స్మారక సంచిక 'హరిత సంతకం' గ్రంథ ఆవిష్కరణ చేసిన ముఖ్య అతిథి డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ.. వెంకట సుబ్బయ్య జీవితం సమాజానికి ఆదర్శప్రాయం అన్నారు. మానుకొండ ఉపేంద్రరావు, తోటకూర వెంకట నారాయణ, షేక్ ఇస్మాయిల్‌లు వెంకట సుబ్బయ్యతో జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.

రచయితలకు సన్మానం

రెండోదైన సోమేపల్లి సాహితీ విశ్లేషణ సభకు డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించగా, డాక్టర్ సుంకర గోపాలయ్య వచన కవిత్వం, కె.జె.రమేష్ నానీలపై మాట్లాడారు. మూడో సభకు షేక్ హసీంబీ అధ్యక్షత వహించగా, నాగిశెట్టి నాగేశ్వరరావు రాసిన 'నా నానీలు' పుస్తకాన్ని సోమేపల్లి విజయలక్ష్మి ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ భవానీదేవి, రాచమళ్ల ఉపేందర్ సమీక్ష చేశారు. ప్రాతఃస్మరణీయులు పుస్తకావిష్కరణ అనంతరం 15వ సోమేపల్లి సాహితీ పురస్కారాల సభకు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. సాహితీవేత్త కాట్రగడ్డ దయానంద్ మాట్లాడారు. మొదటి బహుమతి సాధించిన 'డొక్కు బండి' రచయిత వెంకు సనాతనికి, 'ఆసరా' కథా రచయిత మయూఖ, 'ఉచిస్టం' రచయిత సింగరాజు శ్రీనివాసరావుకు ప్రత్యేక ప్రశంసా పురస్కారాలు, నగదు, జ్ఞాపికలు అందించారు. వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. సభలో ఆహ్వాన కమిటీ సభ్యులు ఎస్.ఎం.సుభాని, నానా, శ్రీవశిష్ఠ, విరించి, ఉమామహేశ్వర రెడ్డి, శర్మ, జయప్రకాష్, పుష్పాదేవి, చంద్రశేఖర్, రచయితలు, కవులు, సాహితీవేత్తలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

అనాథ శరణాలయం అభివృద్ధికి కృషి



మాచవరం: వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో పేదల విద్యాభివృద్ధికై ఏర్పాటు చేసిన జీవీజీకేఆర్‌ఓ అనాథ శరణాలయం అభివృద్ధికి శాఖాపరంగా కృషి చేస్తామని జిల్లా దేవదాయ శాఖ అధికారి కె.వీరాంజినేయులు అన్నారు. మండలంలోని పిల్లుట్ల గ్రామంలో ఈఓ జి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జీవీజీకే అనాథ శరణాలయం దాతలు గుర్రం వీరారెడ్డి, గోపాలకృష్ణారెడ్డి 102వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో దాతల చిత్రపటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. దాతల సమాధుల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. కార్యక్రమంలో వీరాంజినేయులు మాట్లాడుతూ.. గుర్రం వీరారెడ్డి, గోపాల కృష్ణారెడ్డిల దానగుణం ఎన్నడూ మరువలేనిదని అన్నారు.

అమరజీవికి ఘన నివాళులు



నివాళులు అర్పిస్తున్న జెడ్పీ సీఈవో జ్యోతిబసు, అధికారులు, ఉద్యోగులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, జెడ్పీ ఇన్‌చార్జ్ అకౌంట్స్ అధికారి శామ్యూల్ పాల్, ఏవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరుడైన పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (ఏఆర్) ఎ.హనుమంతు, ఎంటీ ఆర్‌ఐ శ్రీహరిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా నదిలో ఈత కొడుతూ వ్యక్తి మృతి



సీతారామిరెడ్డి మృతదేహం

తాడేపల్లి రూరల్: కృష్ణా నదిలో ఈత కొడుతూ ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ టైమ్స్ హాస్పిటల్ దగ్గర నివాసముండే ఎం.సీతారామిరెడ్డి (58) ప్రతిరోజు ఈతకు కృష్ణానదికి వస్తాడని, రోజు లాగే ఆదివారం కూడా వచ్చి ఈదుతున్న సమయంలో గుండెపోటు వచ్చిందన్నారు. నీటిలో మునిగి మృతి చెందాడని తెలియజేశారు. కృష్ణానది ఎగువ ప్రాంతంలోని అమరావతి కరకట్ట వెంబడి పడవల రేవు వద్ద ఈ ఘటన జరిగిందన్నారు. ఈ సంఘటనపై బంధువులు తమకు ఎటువంటి కేసు అవసరం లేదని పోలీసులకు తెలిపారు.

సొంత ఖర్చుతో రోడ్డుపై గుంత పూడ్చివేత



పర్చూరు(చినగంజాం): పర్చూరు మండల పరిధి ఆదిపూడి గ్రామానికి చెందిన కాల్వ రఘురామయ్య సొంత ఖర్చుతో రోడ్డుపై గుంతను పూడ్చారు. ఆయన ద్విచక్ర వాహనంపై ఆదివారం పెదనందిపాడు నుంచి పర్చూరు వస్తుండగా అడుసుమల్లి దాటిన తరువాత బ్రిడ్జి మధ్యలో పెద్ద గుంతను గమనించారు. ఇనుప చువ్వలు బయటకు వచ్చి కనిపించాయి. వాహనదారులు ప్రమాదాల బారిన పడతారని గ్రహించిన రఘురామయ్య తన ద్విచక్ర వాహనాన్ని అక్కడే గుంతకు అడ్డుగా ఉంచారు. అక్కడి నుంచి బస్సులో పర్చూరు చేరుకొని సిమెంట్, ఇసుక కొనుగోలు చేసుకొని వెళ్లి కాంక్రీట్ కలిపి తీసుకొచ్చారు. గుంతను పూడ్చి వేసి ఆదర్శంగా నిలిచారు. ఆయనను పలువురు అభినందించారు.

ఈఎంఐ చెల్లించాలని వేధింపులతో కూలి బలి

- తాపీ పనులకు వెళ్లగా విరిగిన చేయి
- వైద్య ఖర్చుల కారణంగా ఈఎంఐ చెల్లించలేని దైన్యం
- వెంటనే కట్టాలని రోజూ ఇంటికొచ్చి ప్రతినిధుల వేధింపులు
- గడ్డి మందు తాగి కూలి ఆత్మహత్య

తాడేపల్లి రూరల్ : ఈఎంఐలు కట్టాలని నిత్యం వేధింపులు ఎక్కువ కావడంతో కూలి ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర ఘటన తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో చోటుచేసుకుంది. తాపీ కూలిగా పనిచేసే ఆ వ్యక్తి ప్రమాదంలో గాయపడి చేయి విరిగి పని చేయలేని పరిస్థితుల్లో ఉన్నా... కంపెనీ ప్రతినిధుల వేధింపులు నిత్యం ఎక్కువ కావడంతో తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... వడ్డేశ్వరంలో నివాసం ఉంటూ తాపీ కూలిగా పనిచేస్తూ పోలేటి రవి (39) కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండు నెలల క్రితం పనిచేసే సమయంలో ప్రమాదవశాత్తు కింద పడి చేయి విరిగింది. అప్పటి నుంచి పనికి వెళ్లడం లేదు. వైద్యం, కుటుంబ పోషణ ఖర్చులు పెరిగి కష్టంగా ఉండడంతో తీసుకున్న ఈఎంఐలు కట్టలేకపోయాడు. ఈఎంఐలు కట్టాలని సదరు కంపెనీ ప్రతినిధులు ఇంటికి వచ్చి పలుమార్లు గొడవ చేయడంతో సర్ది చెప్పి పంపించాడు. వారు రోజురోజుకూ వేధింపులు పెంచడంతో మనస్తాపం చెందాడు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా పంట పొలాల్లోకి వెళ్లి ఖాళీ గడ్డిమందు సీసా దొరకడంతో దాంట్లో నీళ్లు పోసుకుని తాగాడు. అనంతరం 10 రోజుల తరువాత అస్వస్థతకు గురికావడంతో తల్లి ఉషారాణి, భార్య వైద్యం నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షలు నిర్వహించిన సమయంలో పురుగుల మందు తాగినట్లు తెలిసింది. తల్లి వివరాలు అడగ్గా.. ఈఎంఐలు కట్టమని కొందరు నిత్యం వేధిస్తున్న విషయాన్ని బయట పెట్టాడు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. తల్లి ఉషారాణి దీనిపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కోటయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ చార్జీలపై ప్రజల్ని వంచించిన కూటమి



రాష్ట్ర సర్కారు తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబురావు
- కరెంట్ బిల్లులను దహనం చేసి నాయకుల నిరసన

లక్ష్మీపురం: తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు చార్జీలు పెంచి ప్రజల్ని వంచించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు విమర్శించారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయం వద్ద ఆదివారం విద్యుత్ బిల్లులను దహనం చేసి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలోనే రూ.15,486 కోట్ల భారం ప్రజలపై వేసిందన్నారు. 25 ఏళ్లపాటు రూ.1.10 లక్షల కోట్లను ప్రజల నుంచి వసూలు చేయటానికి రంగం సిద్ధం చేశారన్నారు. అభివృద్ధి అంటూ పేదలపైనే భారం మోపుతున్నారని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రతి ఇంటికీ రూ.10 వేలు చొప్పున 1.50 కోట్ల మంది వినియోగదారులపై మరో భారం మోపనున్నారని తెలిపారు. మోడీ ఆదేశాలతో అదానీని కాపాడే విషయంలో కూటమి పార్టీలు కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. ఒప్పందం రద్దు చేసుకుంటే రూ.3 వేల కోట్లు పెనాల్టీ చెల్లించాలని అబద్ధాలు చెబుతున్నారని, నయాపైసా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అదే నిజమనుకున్నా రూ.3 వేల కోట్ల పెనాల్టీ కోసం ప్రజలపై రూ.1.10 లక్షల కోట్ల భారం వేస్తారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఇక అదానీ వైపు ఉంటుందో, ప్రజల వైపు ఉంటుందో తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ.. మంచి పాలన అందిస్తామని వాగ్దానం చేసిన కూటమి నాయకులు ఇప్పుడు మోసం చేస్తున్నారన్నారు. కేంద్ర సర్కారు మనుగడ టీడీపీపై ఆధారపడి ఉందని, ఇప్పటికైనా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టాలని, ప్రజల ఆకాంక్షలను ఆ పార్టీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు పాశం రామారావు, వై.నేతాజీ, కె.నళినీకాంత్, అప్పారావు, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ క్రీడకు అన్నివిధాలా ప్రోత్సాహం



రగ్బీ క్రీడాకారులతో నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు



వైద్యశిబిరంలో మందులు అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఫిరంగిపురం: రగ్బీ క్రీడకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని, శారీరక దృఢత్వానికి ఈ క్రీడ నిదర్శనమని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాల క్రీడా స్థలంలో ఆదివారం రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ రగ్బీ చాంపియన్ షిప్ పోటీలు పలనాడు రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే అరవిందబాబు ప్రారంభించి మాట్లాడారు. సై చలన చిత్రం తరువాత మన రాష్ట్రంలో రగ్బీ క్రీడ ప్రజాదరణ పొందిందని చెప్పారు. నరసరావుపేటలో రాష్ట్ర స్థాయి సీనియర్ పోటీలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు వివరించారు. రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ 2016లో రగ్బీ క్రీడ ఒలింపిక్స్‌లో చేరిందని చెప్పారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీలో ఈ క్రీడకు గుర్తింపు లభించిందని చెప్పారు. ఈ పోటీల్లో 18 బాలుర, 14 బాలికల జట్లు పాల్గొన్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఇ.కృష్ణారెడ్డి, వెంకట సుబ్బారావు, డానియేలు, ప్రిన్సిపల్ దీన సుదర్శన్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. రగ్బీ పోటీల సందర్భంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో మేల్ హెల్త్ అసిస్టెంట్ బాబురావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతినిధులు, వైద్యులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఎయిమ్స్‌లో రేడియో డయాగ్నోసిస్ విభాగం, అనాటమీ విభాగానికి సంబంధించి ఇమేజ్ గైడెడ్ మస్క్యులోస్కెలెటల్ ఇంటర్వెన్షన్‌లపై కాడెరిక్ వర్క్‌షాప్, శిక్షణ కార్యక్రమాన్ని రెండు రోజులపాటు నిర్వహించారు. ఇండియన్ రేడియోలాజికల్ – ఇమేజింగ్ అసోసియేషన్, ది మస్క్యులోస్కెలెటర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మధబానందకర్ మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 80 మంది ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన 10 మంది అధ్యాపకులు శిక్షణ ఇచ్చారని వెల్లడించారు. ఈ శిక్షణ పాథాలజీ చికిత్సకు కీలమని తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీమంత్ కుమార్ దాస్, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ జైరాజ్ గోవిందరాజ్, డాక్టర్ జాయ్ ఘోషెల్, డాక్టర్ పృథ్వీనాథ్, డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి, డాక్టర్ యుగంధర్, డాక్టర్ మిథిలేష్, డాక్టర్ కిషోర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ భావలు పాల్గొన్నారు.

పోరాటానికి ప్రతిరూపం పొట్టి శ్రీరాములు



లక్ష్మీపురం: పోరాటానికి ప్రతిరూపం అమరజీవి పొట్టి శ్రీరాములు అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కొనియాడారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ అతిథి గృహం వద్ద అమరజీవి విగ్రహానికి ఆయన ఆదివారం ఉదయం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ... దళితులను దేవాలయాల్లోనికి రానివ్వాలని మొదట పోరాటాన్ని ప్రారంభించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం, తెలుగు జాతి కోసం 56 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్రంతోపాటు ఇతర భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు తోడ్పడ్డారన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ... ఆంధ్రులకు ఒక రాష్ట్రం కావాలని మద్రాస్ ప్రెసిడెన్సీలో శ్రీరాములు ప్రాణ త్యాగం చేశారని తెలిపారు. రాష్ట్రం, ప్రజలు అభివృద్ధి చెందడమే పొట్టి శ్రీరాములుకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, నగరపాల సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, పలు కార్పొరేషన్ చైర్మన్‌లు, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన వారితో అసోసియేషన్ ప్రతినిధులు

తాడేపల్లి రూరల్: ఫెడరేషన్ కప్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ఆదివారం మంగళగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధానిలు మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న ఈ పోటీలకు 57 కేజీల జూనియర్ విభాగంలో షేక్ సాదియా ఆల్మస్, 84 కేజీల జూనియర్ విభాగంలో షేక్ షబీనా, 84 కేజీల సీనియర్ విభాగంలో బొలినేని చంద్రికలను ఎంపిక చేశామని తెలిపారు. క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు గంట వెంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లు బి.ప్రసాద్, భాస్కరరావు, బి. చంద్రిక, జాయింట్ సెక్రటరీలు ఘట్టమనేని సాయి రేవతి, ఎస్‌డీ మస్తాన్ వలి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు జి. మల్లేశ్వరరావు, పి.సందీప్, ఎ.పవన్‌కుమార్, ఎస్‌కే సుభాని, కె. మధుబాబు తదితరులు అభినందించారని వారు తెలిపారు.

వైభవంగా బాల ఏసు ఆలయ జెండా ప్రతిష్ఠ



దివ్యపూజాబలి నిర్వహిస్తున్న విచారణ గురువు ఫాతిమా మర్రెడ్డి, ఫాదర్ కరుణాకరరెడ్డి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో ఆదివారం జెండా ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. క్రీస్తు జయంతి మహోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. ఆలయం వద్ద దివ్య పూజాబలి నిర్వహించారు. ప్రధాన యాజకులు ఫాదర్ తుమ్మా కరుణాకరరెడ్డి వాక్యోపదేశం చేశారు. ప్రతిఒక్కరూ భక్తి భావంతో ప్రార్థించాలన్నారు. అనంతరం క్రీస్తు జయంతి సందర్భంగా ఆలయం వార్షికోత్సవ పూజలకు నిదర్శనంగా ఫాదర్స్ బంగ్లా నుంచి జెండాను ఊరేగింపుగా బాల ఏసు దేవాలయం వరకు తీసుకొచ్చారు. ఆలయ విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి జెండాను ప్రతిష్ఠించారు. గుడిపెద్ద రామిశెట్టి చిన్నయ్యతో కొవ్వొత్తులను వెలిగించారు. ఫాదర్స్ బంగ్లాలో విలేకరుల సమావేశంలో ఫాతిమా మర్రెడ్డి మాట్లాడుతూ.. బాల ఏసు దేవాలయం నిర్మించి ఇప్పటికి 140 ఏళ్ల పూర్తి అయినట్లు తెలిపారు. క్రీస్తు జయంతి పండుగ 23, 24, 25వ తేదీల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. సంబంధిత వాల్ పోస్టర్లు, క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఆలయ సహాయ విచారణ గురువులు బి.ప్రవీణ్ కుమార్, వి.రవీంద్ర, గుడి పెద్దలు కొమ్మారెడ్డి, చిన్నప్పరెడ్డి, శౌరిరాజు, రామిశెట్టి రాజశేఖర్, బందనాథం సతీష్‌బాబు, జె, ప్రకాష్, మరియన్న, థామస్, బాలస్వామి, చిన్నప్పరెడ్డి, సందీప్, జోషి, స్లేవయ్య, సుందరరావు, జోసఫ్‌రాజు, సుధ, అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు.